సాక్షి
పార్వతీపురం మన్యం

శుక్రవారం। 27। సెప్టెంబర్। 2024



సదరం సెంటర్ల ఏర్పాటు

దివ్యాంగులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు జిల్లాలో సదరం శిబిరాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. - 8లో



యూరియా ఇవ్వండయ్యా..!

విజయనగరం జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 90వేల హెక్టార్లకు పైగా వరి పంట సాగైంది. రెండో దశలో జల్లేందుకు యూరియా కొరత రైతులను వెంటాడుతోంది. - 8లో



ఘనంగా స్వచ్ఛతా హి సేవ

కేంద్రియ గిరిజన విశ్వ విద్యాలయంలో గురువారం ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ పేరు మీద ఒక చెట్టు) కార్యక్రమం ఘనంగా జరిగింది. - 8లో

న్యూస్‌రీల్

గ్రామీణ రోడ్లకు తొలి ప్రాధాన్యం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: గ్రామాల రహదారులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ గిరిజన మారుమూల గ్రామాల నుంచి డోలీ మోతలు లేకుండా వారికి రహదారి సౌకర్యం కల్పించేందుకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. అవసరం లేని పనులను రద్దు చేసి అవసరమైన చోట కొత్తగా ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. రహదారి అనుసంధానం లేని గ్రామాలు, అసలు సీసీరోడ్లు లేని గ్రామాలకు ప్రాధాన్యతా క్రమంలో పనులు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి జి.రవి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో కాంట్రాక్ట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురం టౌన్: జిల్లాలో నిర్వహిస్తున్న కేజీబీవీల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన బోధనా సిబ్బంది కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 2024–25 విద్యా సంవత్సర కాలానికి పోస్టులు భర్తీ చేయడానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ -1, పీజీటీ-7, సీఆర్‌టీ-16 పార్ట్‌టైం టీచర్ -7, వార్డెన్-3 మొత్తం 34 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అక్టోబరు 10 వరకు అన్‌లైన్‌లో ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్‌లో నమోదు చేసుకోవచ్చని సూచించారు. 18–42 వయస్సు మధ్య గల మహిళలు అర్హులని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 5 సంవత్సరాలు, మాజీ సైనిక ఉద్యోగులకు 3 సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవ త్సరాలు వయోపరిమితిలో సడలింపు ఉందని తెలిపారు. సబ్జెక్ట్, రోస్టర్, పోస్టులు, గౌరవ వేతనం, విద్యార్హత వివరాలను వెబ్‌సైట్‌లో గమనించాలని కోరారు.

అన్నదాతకు రూ.20 వేలు అందజేయాలి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాంబాబు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

విజయనగరం ఫోర్ట్: అన్నదాతకు పెట్టుబడి సాయం కింద తక్షణమే రూ.20వేలు అందజేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుద్దరాజు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పంటలకు ఉచిత పంటల బీమాను అమలు చేయాలన్నారు. రూ.2 లక్షల వరకు రైతుల రుణాలు మాఫీ చేయాలని కోరారు. వ్యవసాయ మోటార్ల మీటర్లు ఏర్పాటుకు సంబంధించిన జీఓ 22 రద్దు చేయాలన్నారు. భూయాజమాని సంతకంతో పనిలేకుండా వాస్తవ సాగుదారులకు కౌలు గుర్తింపు కార్డులు అందజేసి ప్రభుత్వ రాయితీలు, పథకాలు వర్తింపజేయాలన్నారు. ఎన్‌సీఎస్ సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని క్రషింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తొత్తడి పైడిపినాయుడు, కార్యదర్శి రాకోటి రాములు, రైతు సంఘం నాయకులు గంగునాయుడు, నాగేశ్వరరావు, సూరిదేవుడు, సంతోష్, కోటి, గోపాలం పాల్గొన్నారు.

వారెవ్వా..!

నేడు ఆడలి వ్యూపాయింట్ ప్రారంభం

ఎంత బిజీగా ఉన్నా సరే ప్రయాణాలకు సమయం కేటాయిస్తుంటారు చాలామంది. కొందరు కుటుంబాలతో..మరికొందరు స్నేహితులతో ట్రిప్‌లు వేస్తుంటారు. ప్రతి మనిషి జీవితంలో అలిసిపోయి మానసిక ప్రశాంతతను, విరామాన్ని కోరుకుంటాడు. ఆ సమయంలో కొత్త ప్రదేశాలకు వెళ్లి ఉల్లాసంగా ఉండేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటాడు. అలాంటి వారికి పర్యాటకం ఓ అద్భుతమైన అవకాశం. ఈ నేపథ్యంలో దేశంలో ఎక్కడ అందమైన, మనసుకు ఉల్లాసం కలిగించే ప్రదేశాలు, ప్రాంతాలు ఉన్నాయో తెలుసుకుని మరీ వెళ్లి వీక్షించి మనసు నిండా సంతోషాన్ని, సంతృప్తిని నింపుకుని వచ్చి మళ్లీ బిజీ లైఫ్‌లో పడిపోతుంటారు.

- మది దోచే మన్యం అందాలు
- హొయలొలికే జలపాతాలు
- ఆహ్లాదం పంచే అడవులు, కొండలు
- ఆకర్షణగా అడ్వెంచర్ పార్కు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



వైఎస్సార్‌సీపీ హయంలో అభివృద్ధి చేసిన ఆడలి వ్యూపాయింట్

సీతంపేట: పార్వతీపురం మన్యం జిల్లాలో సీతంపేట మన్యం అందాలు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. ఇక్కడి పర్యాటక ప్రదేశాలు ఆకట్టుకుంటున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పర్యాటకానికి పెద్దపీట వేశారు. ప్రతిరోజూ పర్యాటకులు సీతంపేటను చుట్టి వస్తున్నారు. సెలవురోజుల్లో అయితే ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ముఖ్యంగా స్థానికంగా దోనుబాయి రోడ్డు సమీపంలో అడ్వెంచర్ పార్కు ఉంది. ఇక్కడి జలవిహార్‌లో బోటింగ్, కయాకింగ్, కొరాకిల్, హ్యాంగింగ్‌బ్రిడ్జి ప్రత్యేకం. ఫైవ్ డీ థియేటర్ కూడా పునఃప్రారంభం కానుంది.

సీతంపేటలో పర్యాటక దినోత్సవం..

సీతంపేటలోనే ఘనంగా పర్యాటక దినోత్సవం నిర్వహించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక అడ్వెంచర్ పార్కులో పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు ఆడలి వ్యూపాయింట్ వద్ద అతిథుల రాక, ఆడలి వ్యూపాయింట్, టెంటెడ్ అకామడేషన్, రెస్టారెంట్ ప్రారంభించనున్నారు. స్టాల్స్ విజిట్, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు ఉంటాయి. సాయంత్రం 4 గంటల నుంచి స్థానిక అడ్వెంచర్ పార్కు వద్ద కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సీతంపేట ఏజెన్సీలో అతిపెద్ద వ్యూపాయింట్ ఆడలిగా చెప్పుకోవచ్చు. ఇక్కడి నుంచి చూస్తే హిరమండలం ప్రాంతంలో వంశధార నదీతీర ప్రాంతాలు చూపరులను ఎంతో ఆకట్టుకుంటాయి. పాలకొండ-సీతంపేట మార్గంలో కుశిమి రహదారి గుండా శంభాం మీదుగా ఆడలి పర్యాటకులు చేరుకోవాలి. ఇక్కడ హోటల్స్ వంటివి ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పర్యాటక దినోత్సవం సందర్భంగా దీనిని శుక్రవారం ప్రారంభించనున్నారు.



వ్యూపాయింట్ వద్ద పచ్చని తివాచీ



అడ్వెంచర్ పార్కు



వ్యూ పాయింట్ వద్ద రెస్టారెంట్

జాలువారే జలపాతాలు



మెట్టుగూడ జలపాతం

జాలువారే జలపాతాలు పర్యాటకులను ఎంతో ఆకట్టుకుంటున్నాయి. సీతంపేట నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో మెట్టుగూడ జలపాతం ఉంది. ఇక్కడ నీరు ఈ సీజన్‌లో సెలయేరులా పారుతుంది. ఇక్కడికి వచ్చిన పర్యాటకులు ఉండడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే సీతంపేట నుంచి దోనుబాయి వెళ్లి అక్కడి నుంచి మరో మూడు కిలోమీటర్లు వెళ్తే సున్నపుగెడ్డ జలపాతం వస్తుంది. ఇక్కడ కూడా అనునిత్యం నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. ఎంతో కాలంగా పర్యాటకుల తాకిడి ఇక్కడే ఎక్కువగా కనిపిస్తుంది. మల్లెమ్మ గెడ్డ జలపాతం సంతమల్లి సమీపంలో ఉంది. కుశిమి వెళ్లే రహదారిలో ఇది ఉంది. ఇకపోతే సీతంపేట నుంచి దోనుబాయి వెళ్లే మార్గంలో ఉండే చంద్రమ్మగుడికి కూడా పర్యాటకులు వచ్చి పోతుంటారు.

కిక్కే కిక్కు..!

- గతం కంటే పెరిగిన మద్యం దుకాణాలు
- జిల్లాలో మొత్తం 58 మద్యం షాపులకు అనుమతి
- అందులో అయిదు కల్లుగీత కార్మికులకు..
- ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు తెరుచుకునేందుకు అవకాశం
- ప్రభుత్వ మద్యం దుకాణాలకు మంగళం



సాక్షి, పార్వతీపురం మన్యం: రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ అమలు దిశగా చర్యలు తీసుకుంటున్న కూటమి ప్రభుత్వం.. క్యాబినెట్ సబ్ కమిటీ నివేదికను అనుసరించి మద్యం దుకాణాల ఏర్పాటుపై ఒక నిర్ణయానికి వచ్చింది. వివిధ రాష్ట్రాల్లో మద్యం అమ్మకాల తీరు, వివిధ వర్గాల అభిప్రాయ సేకరణ అంటూ ఇన్నాళ్లూ కాలయాపన చేసినా... చివరకు 'సిండికేట్'కే మొగ్గు చూపినట్టు స్పష్టమవుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో గతంలో 53 వరకూ ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండగా.. తాజాగా వాటి సంఖ్యను 58కు పెంచింది. ఇందులో 53 అన్ రిజర్వుడు కాగా.. ఐదు దుకాణాలను గౌడ (కల్లుగీత కార్మికులు) సామాజిక వర్గాలకు కేటాయించింది. దుకాణాలను ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంచేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మొత్తంగా పాత పద్ధతిలో ప్రైవేట్ దుకాణాలకే మద్దతు పలుకుతూ.. ప్రభుత్వ దుకాణాలకు మంగళం పాడింది.

దరఖాస్తు ఫీజే రూ.2 లక్షలు

మద్యం దుకాణాలకు సంబంధించి దరఖాస్తుల రూపంలోనే ప్రభుత్వానికి భారీగా ఆదాయం రానుంది. ఒక దరఖాస్తుకు రూ.2 లక్షల వరకు ఫీజు విధించింది. దుకాణం దక్కినా, దక్కకపోయినా ఈ మొత్తం దరఖాస్తుదారుడికి తిరిగి చెల్లించరు. లైసెన్సు రెండు సంవత్సరాలకు కాగా.. జనాభా ప్రాతిపదికన స్లాబ్ ధరలను భారీగా నిర్ణయించారు. పదివేల జనాభా వరకు రూ.50 లక్షలు, 10 వేల నుంచి 50 వేల వరకూ జనాభా ఉన్న చోట.. రూ.55 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల వరకూ రూ.65 లక్షలు, 5 లక్షలు దాటితే రూ.85 లక్షలు లైసెన్స్ ఫీజు కింద దుకాణాలు దక్కించుకున్న వారు చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు దరఖాస్తుల రూపంలోనే ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరనుంది. ఒక్కో దుకాణానికి సుమారు 20 నుంచి 25 వరకూ దరఖాస్తులు వస్తాయని అంచనా. ప్రధాన కూడళ్లు, వ్యాపారం అధికంగా జరిగే ప్రాంతాల్లో మరింత డిమాండ్ ఉంటుంది. పార్వతీపురం మండలంలోని లచ్చిరాజుపేట, గరుగుబిల్లి మండలంలో ఉల్లిభద్ర, సీతానగరం మండలం అంటి పేట వంటి చోట్ల దుకాణానికి 35 వరకు దరఖాస్తులు వస్తాయి. ఇలా దరఖాస్తులు, లైసెన్స్ ఫీజుల రూపంలోనే ప్రభుత్వ ఖజానా భారీగా నిండుతుంది. ఇంత మొత్తంలో చెల్లించిన ప్రైవేట్ వ్యాపారులు.. యథేచ్ఛగా దోపిడీకి తెర తీస్తారు. తక్కువ ధరకే బ్రాండెడ్ మద్యం అమ్మకం చేపడతామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ దోపిడీకి దర్జాగా లైసెన్స్ ఇచ్చినట్లేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సిండికేట్లా మారే వ్యాపారులు.. బాటిల్ దగ్గర రూ.20 నుంచి రూ.50 వరకూ అదనంగా విక్రయించే అవకాశాలు లేకపోలేదని గత సంఘటనలు రుజువు చేస్తున్నాయి. గ్రామాల్లో గొలుసు దుకాణాలకు కూడా వీరినుంచే సరకు గతంలో చేరేది. ఫలితంగా పల్లెల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగేవి. మళ్లీ పాత రోజులు పునరావృతం కానున్నాయని ప్రజా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

దోపిడీకి సహకరించేలా సెబ్ ఎత్తివేత..

మద్యం అక్రమాలను అరికట్టేందుకే ప్రత్యేకంగా గత ప్రభుత్వం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) వ్యవస్థను నెలకొల్పింది. ప్రభుత్వ మద్యం దుకాణాల ఏర్పాటుతో అటు అక్రమాలను అరికట్టడంతో పాటు.. మరోవైపు మామూళ్లకు అలవాటు పడిన కొంతమంది ఎక్సైజ్ సిబ్బందికీ చెక్ పెట్టింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం.. నూతన మద్యం పాలసీ అమలు చేయడంతో పాటు.. సెబ్ వ్యవస్థనూ రద్దు చేసింది. దీంతో అందులోని అధికారులను మరలా ఎక్సైజ్ శాఖకు బదిలీ చేసింది. జిల్లాలో 340 మంది వరకు వివిధ హోదాల్లోని అధికారులు, ఉద్యోగులు ఎక్సైజ్ శాఖకు వెళ్తున్నారు. గతంలోనూ సిండికేట్‌కు ఎక్సైజ్ అధికారులే పరోక్షంగా సహకరించేవారన్న ఆరోపణలు ఉండేవి. మరలా అదే పరిస్థితి వస్తుందని.. మద్యం దోపిడీని ప్రోత్సహించేందుకే ప్రభుత్వం ఇటువంటి చర్యలు తీసుకుంటోందని ప్రజా సంఘాల నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కూటమి నేతల కన్ను..

మద్యం అమ్మకాలు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్తుండడంతో.. దుకాణాలను దక్కించుకునేందుకు కూటమి నాయకులు స్కెచ్ వేస్తున్నారు. దుకాణాల విషయంలో ఇప్పటికే గ్రూపులుగా ఏర్పడి.. ఆయా ప్రాంతాలను రిజర్వు చేసుకుని.. వారే దరఖాస్తులు సమర్పించేలా పరస్పర అంగీకారానికి వస్తున్నారు. గౌడ సామాజిక వర్గీయులకు కేటాయించిన దుకాణాలపైనా కన్నేశారు. వారిని బినామీలుగా పెట్టి.. నడిపించేందుకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు ఇప్పటివరకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వారి ఆందోళనను, విజ్ఞప్తులను ప్రభుత్వం ఇప్పటివరకు పట్టించుకోలేదు.

చంద్రబాబు పాపాల ప్రక్షాళన

- 28న ఆలయాల్లో పాపప్రక్షాళన పూజలు
- వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుతో ఏర్పాట్లు
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సమాయత్తం చేసిన జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: వేంకటేశ్వర స్వామి విశిష్టతను, తిరుమల పవిత్రతను రాజకీయ లబ్ధి కోసం అబద్ధ ప్రచారాలతో దెబ్బతీస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పాపాలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అన్నారు. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆలయాల్లో పాప ప్రక్షాళన పూజలు చేయాలని తమ పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు జిల్లాలో ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ఈ నెల 28వ తేదీన (శనివారం) ఆలయాల్లో పూజలు చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు గురువారం ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో ఉన్నా రాజకీయ దుర్బుద్ధితో అసత్య ప్రచారాలకు దిగారన్నారు. చివరకు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమంది భక్తులున్న తిరుమల వేంకటేశ్వరస్వామి వైభవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎంతో పవిత్రంగా భావించే లడ్డూ ప్రసాదం విశిష్టతనూ అపవిత్రం చేయడానికీ తెగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రసాదం తయారీకి ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు కల్తీ జరిగిందన్నట్లుగా, ఆ కల్తీ ప్రసాదమే భక్తులు తిన్నట్లుగా చంద్రబాబు అసత్య ప్రచారానికి తెరతీశారని చెప్పారు. కల్తీ జరగకపోయినా జరిగిందన్నట్లుగా చెబుతూ వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాద విశిష్టతకు, టీటీడీ పేరుప్రఖ్యాతులకు మచ్చతెస్తున్న చంద్రబాబు పాపాల ప్రక్షాళన అవ్వాలంటే అందరూ ఈనెల 28వ తేదీన ఆలయాల్లో పూజలు నిర్వహించాలని కోరారు. పూజా కార్యక్రమాల్లో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ మండలాధ్యక్షులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న సభ్యులు, పార్టీ ముఖ్యనాయకులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. తద్వారా తిరుమల వేంకటేశ్వరస్వామి వైభవాన్ని, లడ్డూ ప్రసాదం విశిష్టతనూ పరిరక్షించాలని కోరారు.

విద్యలనగరంలో పాయల్ సందడి

- ఎల్‌జీటీ సినిమాస్‌ను ప్రారంభించిన పాయల్ రాజ్‌పుత్
- ఆమెను చూసేందుకు తరలివచ్చిన యువత





థియేటర్‌ను ప్రారంభిస్తున్న సినీతార పాయల్ రాజ్‌పుత్

విజయనగరం రూరల్: ఆర్‌ఎక్స్–100 ఫేమ్ పాయల్‌రాజ్‌పుత్ గురువారం విద్యలనగరంలో సందడి చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన ఎల్‌జీటీ సినిమాస్‌ను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా మాల్ యజమాని త్రినాథరావు మాట్లాడుతూ ఈ మాల్‌లో నేటి తరానికి నచ్చేలా, ఆహ్లాదాన్ని పంచేలా 4కె నాణ్యత కలిగిన నాలుగు స్క్రీన్స్‌ను ఏర్పాటుచేశామన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో కూడిన సౌండ్ సిస్టిమ్ ప్రేక్షకులను ఆకర్షిస్తుందన్నారు. నగరంలో ఎక్కడా లేనివిధంగా విశాలమైన సిటింగ్ డికలైనర్స్ (పడుకుని సినిమా చూసేలా) సీట్లను అమర్చినట్టు వెల్లడించారు. సినీనటి పాయల్‌రాజ్‌పుత్ మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే ఆంధ్రా ప్రేక్షకులు తనను బాగా ఆదరిస్తుండడం ఆనందంగా ఉందన్నారు. రూ.కోట్లు ఖర్చుచేసి తీసిన సినిమాలను కొంతమంది పైరసీ చేస్తున్నారని, దీనివల్ల సినీ పరిశ్రమ నష్టపోతుందన్నారు. పైరసీని అరికట్టడంలో సినీ ప్రేక్షకులు భాగస్వాములు కావాలని కోరారు. విజయనగరం రావడం ఇది రెండోసారని, ఇక్కడ వాతావరణం చాలా బాగుందని, ఇక్కడ ఇంత మంది అభిమానులు ఉండడం తన అదృష్టంగా పేర్కొన్నారు. మరిన్ని మంచి సినిమాలు చేసి ప్రేక్షకుల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకుంటానని తెలిపారు. అత్యాధునిక హంగులతో కొత్తగా ఏర్పాటుచేసిన థియేటర్‌లో సినిమాలు తిలకించాలని కోరారు. పాయల్‌రాజ్‌పుత్‌ను చూసేందుకు పోర్టుసిటీ ప్రాంగణానికి పెద్ద ఎత్తున ప్రేక్షకులు తరలివచ్చారు. ఆమెతో సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. కార్యక్రమంలో ఎల్‌జీటీ సినిమాస్ డైరెక్టర్లు నవ్య, సాయివందన, సుహాస్ థియేటర్ మేనేజర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే దేశభక్తి అలవడాలి

- కోరుకొండ సైనిక్ స్కూల్ విద్యార్థుల క్రమశిక్షణ ఆకట్టుకుంది
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



విద్యార్థులతో మాట్లాడుతున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

విజయనగరం రూరల్:

విద్యార్థి దశ నుంచే దేశభక్తిని కలిగి ఉండాలని, క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకోవాలని మాజీ ఉపరాష్టపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా పర్యటనకు గురువారం వచ్చిన ఆయన కోరుకొండ సైనిక్ స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ముందుగా పాఠశాలలోని వివిధ విభాగాలు, ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ సామాన్యమైన కుటుంబంలో పుట్టి ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగానంటే ప్రధాన కారణం కృషి, పట్టుదలతో పాటు క్రమశిక్షణతో కూడిన జీవితమని తెలిపారు. మనం ఎక్కడున్నా.. ఎలాఉన్నా.. ఎంత స్థాయిలో ఉన్నా మాతృభూమిని, మాతృభాషను గౌరవించడం మర్చిపోరాదన్నారు. ప్లేస్, డ్రెస్ మారినా అడ్రస్సుమాత్రం మారదన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగితే భవిష్యత్తు బంగారుమయమవుతుందన్నారు. అనంతరం లెఫ్టినెంట్ కల్నల్ సంతోష్‌బాబుతో కలిసి మోటివేషనల్ హాల్‌ను సందర్శించా రు. సైనిక్ స్కూల్‌లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉందన్నారు. ఇటువంటి పాఠశాలలో విద్యను అభ్యసించాలంటే ప్రతిభతో పాటు ఆవగింజంత అదృష్టం కూడా ఉండాలంటూ చమత్కరించారు. ఇక్కడి బోధన, బోధనేతర సిబ్బంది క్రమశిక్షణతో మెలగడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ కమాండర్ కిరణ్ పాల్గొన్నారు

క్లుప్తంగా

కోటదుర్గమ్మ హుండీల ఆదాయం లెక్కింపు


హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయ హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. ఈ నెల 4వ తేదీ నుంచి గురువారం వరకు 22 రోజులకు గాను హుండీల నుంచి రూ 1,85,222 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ తెలిపారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో హుండీల ఆదాయం లెక్కింపు చేసి దసరా నవరాత్రుల్లో వచ్చే ఆదాయం లెక్కింపు చేయాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

అప్పల బాధతో వ్యక్తి ఆత్మహత్య


వెంకటరమణ (ఫైల్)

రేగిడి: మండలంలోని బాలకవివలస గ్రామానికి చెందిన కోడిశ వెంకటరమణ (42) తీసుకున్న అప్పులు తీర్చలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై పోలీసులు అందించిన సమాచారం మేరకు వెంకటరమణ బొలెరో వ్యాన్ నడుపుకుంటూ మరో పక్క వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు భార్య చంద్రకళతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. తనకు ఉన్న సొంత ఇంటిమీద కూడా అప్పులు చేశాడు. నెలవారీ అప్పులు తీర్చలేక మనస్తాపం చెంది బుధవారం రాత్రి గ్రామం బయట పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం గమనించిన గ్రామస్తులు వెంకటరమణను రాజాం కేర్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై గౌరునాయుడు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంలో లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి మృతుని కుటుంబసభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. బుధవారం సాయంత్రం బొబ్బిలి నుంచి తెర్లాం మీదుగా వెళ్తున్న లారీ స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై గ్రామానికి చెందిన వెంపడాపు భీమయ్యను బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో భీమయ్యకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే రాజాం కేర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం 108 వాహనంలో తీసుకువెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం రాగోలులోని జెమ్స్ ఆస్పత్రికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా భీమయ్య మృతి చెందాడు. మృతునికి భార్య, వివాహమైన ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. రాజాం సీహెచ్‌సీలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై సాగర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోనేరులో కాలు జారిపడి మహిళ..


అన్నపూర్ణ మృతదేహం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం అగ్రహారంలో గల కోనేరులో కాలు జారిపడి ఓ మహిళ మృతి చెందింది. గురువారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని అగ్రహారానికి చెందిన ఎం.అన్నపూర్ణ (40) స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి కోనేరులో పడిపోవడంతో స్థానికులు స్పందించి బయటకు తీసినప్పటికే ఆమె మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టంనిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సదరం సెంటర్ల ఏర్పాటు

- కలెక్టరు శ్యామ్ ప్రసాద్



ట్రాన్స్‌జెండర్‌లకు ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ శ్యామ్‌మ ప్రసాద్

పార్వతీపురం: దివ్యాంగులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు జిల్లాలో సదరం శిబిరాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, సీనియర్ సిటిజన్ల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు పెన్షన్లు, బస్‌పాస్‌లు, రైల్వేపాసులు అందిస్తున్నట్లు చెప్పారు. విద్య, ఉద్యోగాలలో దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేసేందుకు జిల్లాలో సదరం శిబిరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సీనియర్ సిటిజన్లు సామాజిక సంపద

సీనియర్ సిటిజన్లు సామాజిక సంపద అని కలెక్టర్ అన్నారు. సీనియర్ సిటిజన్లు సమాజానికి వారి అనుభవాలను అందించి మార్గదర్శకులుగా నిలవాలని పిలుపునిచ్చారు. అక్టోబరు 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్న 'సుందర పార్వతీపురం కార్యక్రమం'లో సీనియర్ సిటిజన్లు పాల్గొనాలని, పారిశుధ్యం, ప్లాస్టిక్ నిషేధం, తడిచెత్త, పొడిచెత్త విడిగా అందజేయుట, పరిసరాల పరిశుభ్రత, విద్యార్థులకు విజ్ఞానం అందజేయడం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఇంటి స్థలాలు, రేషన్‌కార్డులు, ఉపాధి అవకాశాలు కల్పించాలని ట్రాన్స్ జెండర్లు కోరగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు.

ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డులు

49 మంది ట్రాన్స్ జెండర్లకు గుర్తింపు కార్డులను కలెక్టర్ గురువారం అందజేశారు. వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారిలో పది మంది పట్టభద్రులు ఉన్నామని తెలియజేయగా కలెక్టర్ అభినందించారు. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, సీనియర్ సిటిజన్ల సంక్షేమశాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత శాఖాపరంగా అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలు తెలిపారు. దివ్యాంగులకు ఉద్యోగాలలో నాలుగుశాతం రిజర్వేషన్లను రోస్టరు పాయింట్ల వారీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 17,034 మంది దివ్యాంగులు, 129 ట్రాన్స్‌జెండర్లు, 79,498 మందికి వృద్ధాప్య పింఛన్లు అందజేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, ఏఎస్పీ అంకిత సురానా మహావీర్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై సత్యంనాయుడు, రెడ్ క్రాస్ చైర్మన్ డా. ఎం.శ్రీరామమూర్తి, కమిటీ సభ్యులు గణపతిరావు, ఇతర అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

డీసిల్ట్ తొలగింపు పరిశీలన


సువర్ణముఖి నదిలో డీసిల్ట్ తొలగింపు పనులు పరిశీలిస్తున్న జేసీ సేతుమాధవన్

వంగర: మండల పరిధి కొండచాకరాపల్లి గ్రామ సమీపంలో సువర్ణముఖి నదిలో మట్టి, మడ్డి, ఇసుక(డీసిల్ట్) తొలగింపు పనులను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ గురువారం పరిశీలించారు. నదిలో ప్రస్తుతం ఉన్న నీటిప్రవాహం, మడ్డి, మట్టి, ఇసుక వేరుచేసే ప్రక్రియపై సంబంధిత కాంట్రాక్టర్‌తో చర్చించారు. అనంతరం ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. యంత్రాలు ఉపయోగించి సిల్ట్ తొలగించకూడదని, కూలీలతో తొలిగించాలని ఉత్తర్వుల్లో ఉందని అధికారులు జేసీ దృష్టికి తీసుకువచ్చారు. బహిరంగ ఇసుక రీచ్‌లలో యంత్రాలు వినియోగిం చకూడదని, డీసిల్ట్ పనుల్లో యంత్రాలు ఉపయోగించవచ్చునని, ఈ అంశంపై అవసరమైతే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని జేసీ వెల్లడించారు. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్టాక్‌పాయింట్‌కు వెళ్లే వాహన వివరాలను నమోదు చేయాలని కొండచాకరాపల్లి, కొప్పర సచివాలయాల సిబ్బందిని జేసీ సేతు మాధవన్ ఆదేశించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ విలేకరులతో మాట్లాడారు. నదిలో నీటిప్రవాహం ఉన్నందున డీసిల్ట్ తొలగింపులో కొంత జాప్యం జరుగుతోందని, నదిలో 3.4 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ పనులు చేపడతామని తెలియజేశారు. మట్టి, మడ్డిని తమ గ్రామానికి రక్షణ గట్టుగా వేయాలని కొండచాకరాపల్లి గ్రామస్తులు కోరారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి కె.సందీప్ కూడా ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ దిరిశాల ధర్మరాజు, మైనింగ్, ఇరిగేషన్ అధికారులతో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన వర్సిటీలో ఘనంగా స్వచ్ఛతా హి సేవ


మొక్క నాటుతున్న గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో గురువారం ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ పేరు మీద ఒక చెట్టు) కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ తేజస్వి కట్టిమణి తన తల్లి "సంగమ్మ" పేరు మీద ఒక మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చాన్సలర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ ముడిపడి ఉందని, కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తదితరులు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి మన అందరిలో స్ఫూర్తిని నింపారని ప్రతి విద్యార్థి ఈ కార్యక్రమంలో పాల్గొని తమ తల్లి పేరు మీద కనీసం ఒక్క మొక్కనైనా నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కంప్యూటర్ విభాగాధిపతి డా. బొంతు కోటయ్య సమన్వయ కర్తగా వ్యవహరించారు. యూనివర్సిటీ డీన్లు, అధ్యాపకులు, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు తమ తమ తల్లి పేరు మీద మొక్కలను నాటారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన


కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఎస్పీ వకుల్ జిందాల్ గురువారం సందర్శించారు. వివిధ ప్రాంతాలు, రహదారి కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను, వాటి లైవ్ వీడియోలను ఈ సందర్భంగా పరిశీలించారు. రహదారి ప్రమాదాలు, దొంగతనాలు జరిగినపుడు వాహనాలను కంట్రోల్ రూమ్ నుంచి ఏవిధంగా ట్రాక్ చేయవచ్చు, సీసీ పుటేజీలన, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉన్న ప్రాంతాలను, ప్రత్యక్షంగా జరుగుతున్న ధర్నాలను, సంఘటనలను కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచే ఎలా పర్యవేక్షించవచ్చునన్న అంశాలను ఎస్పీ పరిశీలించారు. సిగ్నల్ పాయింట్ల వద్ద ఎం.వి. నిబంధనలు పాటించకుండా సిగ్నల్ జంపింగుకు పాల్పడుతున్న వాహనదారులపై ఆటోమేటిక్ గా ఈ-చలానా జనరేట్ అవుతాయని, నిబంధనలు అతిక్రమించినట్లుగా రుజువు చేస్తూ అందుకు సంబంధించిన సాక్ష్యాలుగా సీసీ కెమెరాల్లో ఫోటోలు నిక్షిప్తమవుతాయని కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, ఆర్‌టీజీ సిబ్బంది ఎస్పీకి వివరించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ ఏవీ లీలారావు, ఇతర అధికారులు, కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక


జశ్వంత్, సంజన, నందకిషోర్‌లను అభినందిస్తున్న పీడీ ఉమామహేశ్వరరావు

వీరఘట్టం: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో జరుగుతున్న అథ్లెటిక్స్ పోటీల్లో వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు సత్తాచాటారు. గురువారం జరిగిన ఈ పోటీల్లో 6 కి.మీ పరుగు పందెంలో ఎస్.జశ్వంత్ ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. అలాగే 3 కి.మీ పరుగు పందెంలో బాలికల విభాగంలో పి.సంజన, బాలుర విభాగంలో ఎస్.నందకిశోర్‌లు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన తమ విద్యార్థులను హెచ్ఎం బిడ్డిక సాంబర, గర్భాన శ్రీనివాసరావు, కల్లూరి శివకుమార్ తదితరులు అభినందించారు.

తీరంలో అప్రమత్తం

- ఉవ్వెత్తున ఎగసి పడుతున్న కెరటాలు


తిప్పలవలసలో ఎగసిపడుతున్న కెరటాలు

పూసపాటిరేగ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, ఉపరితల ఆవర్తన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ తాడ్డి గోవింద తెలియజేశారు. వర్షాల కారణంగా కొత్త నీరు సముద్రంలో చేరడంతో కడలి అల్ల కల్లోలంగా మారుతోందన్నారు. అలల ఉధృతికి సముద్రం ముందుకు రావడంతో తీరం కొన్ని చోట్ల కోతకు గురైంది. తీరంలో ఉన్న పడవలు, వలలను మత్స్యకారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. తీరప్రాంత గ్రామాలైన చింతపల్లి, పతివాడబర్రిపేట, తమ్మయ్యపాలెం, పులిగెడ్డ, తిప్పలవలస, కోనాడ గ్రామాల్లో మత్స్యకారులు వర్షాల కారణంగా వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించాలని తహసీల్దార్ సూచించారు. సముద్రాన్ని ఆనుకుని ఉన్న తిప్పలవలస, చింతపల్లి, పతివాడబర్రిపేట, కోనాడ గ్రామాల్లో భారీవర్షాలు, గాలులు వీస్తున్నందున మత్స్యకారులు అప్రమత్తంగా వ్యవహరించాలని హెచ్చరించారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు గరికివలస విద్యార్థి


మండల ధనలక్ష్మి

గుర్ల: మండలంలోని గరికవలస హైస్కూల్ విద్యార్థిని మండల ధనలక్ష్మి సబ్ జూనియర్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికై నట్లు పీఈటీ మల్లికార్జున రావు గురువారం తెలిపారు. రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు, ఈనెల 28 నుంచి అక్టోబర్ 2 వరకు జార్ఖండ్‌లో జరిగే పోటీలలో ఆమె పాల్గొంటుందని చెప్పారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ధనలక్ష్మిని హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

15 దేశాలు.. 160 పరిశోధన పత్రాలు


వికసిత్ భారత్ వాటి లక్ష్యాలు,అబ్‌స్ట్రాక్ట్ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు

పర్లాకిమిడి: ఆర్.సీతాపురంలో సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో గురువారం వికసిత్ భారత్, వినూత్న వ్యాపారం, వ్యవసాయం, టెక్నాలజీ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై వనరుల నిర్వాహణపై అంతర్జాతీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ బినోద్ ఆత్రేయ (నేపాల్), ఓఆర్ఎస్ఐ. (భువనేశ్వర్) డాక్టర్ రబినారాయణ సుబుద్ధి, ప్రొఫెసర్ మోనీ మడస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈ అంశాలపై దేశ విదేశాలకు చెందిన నిష్ణాతులు కూలంకషంగా మాట్లాడారు. రెండురోజుల ఈ సదస్సుకు సెంచూరియన్ వైస్ చాన్సలర్ డాక్టర్ సుప్రియా పట్నాయిక్ అధ్యక్షత వహించారు. సదస్సులో 15 దేశాల నుంచి 160 పరిశోధన పేపర్లు అందినట్లు రబినారాయణ సుబుద్ధి తెలిపారు.

వచ్చే నెల 1,2, తేదీల్లోజనజాతి సమ్మేళనం

విజయనగరం అర్బన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో విజయనగరంలో అక్టోబర్ 1, 2 తేదీలలో జనజాతి విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎ. ఆనంద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను గురువారం స్థానిక కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారతీయ సంస్కృతికి మూలధారమైన జనజాతి సంస్కృతి సంప్రదాయాలు భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి జనజాతి బిడ్డపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ బొబ్బది సాయి కుమార్, విభాగ్ సంఘటన కార్యదర్శి పెంచలయ్య, గిరిజన విద్యార్థుల రాష్ట్ర కన్వీనర్ గెమ్మెలి కల్యాణ్, పార్వతీపురం జిల్లా కన్వీనర్ అల్లంగి మహేష్, నాని, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో పునర్జన్మ


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ తిరుమల ప్రసాద్

- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం టౌన్: వరల్డ్ హార్ట్ డే సందర్భంగా తిరుమల-మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో సీపీఆర్‌లో పోలీసు సిబ్బందిని సుశిక్షితులను చేసేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ వకుల్ జిందాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ-ఫ్రంట్ లైన్ వారియర్‌గా సమాజానికి ఇంకామెరుగైన సేవలందించేందుకు పోలీసు సిబ్బంది సీపీఆర్ నిర్వహించడంలో సుశిక్షితులను చేసేందుకు తిరుమల-మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏదైనా రహదారి ప్రమాదం లేదా మరేదో సంఘటన జరిగినట్లు సమాచారం అందిన వెంటనే ఫ్రంట్ లైన్ వారియర్‌గా సంఘటనా స్థలానికి ముందుగా చేరేది పోలీసులేనని, సంఘటనా స్థలంలో గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్న వారికి అవసరాన్ని బట్టి గోల్డెన్ అవర్స్‌లో సీపీఆర్ చేస్తే, వారికి పునర్జన్మ అందించిన వారమవుతామన్నారు. అయితే, సీపీఆర్ ఎప్పుడు, ఎలా, ఎంతసేపు నిర్వహించాలన్న విషయాలపై తప్పనిసరిగా పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. తిరుమల-మెడికవర్ ఆస్పత్రి ఎం.డి. డాక్టర్ కె.తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ-దొమ్మీలు, త్రొక్కిసలాటలు జరిగినపుడు మనల్ని మనం రక్షించుకుంటూ, ఇతరులను రక్షించేందుకు పోలీసు సిబ్బందికి తప్పనిసరిగా సీపీఆర్ చేసే విధానం పట్ల అవగాహన ఉండాలని అభిప్రాయ పడ్డారు. తిరుమల-మెడికవర్ ఆసుపత్రి కార్డియాక్ వైద్యుడు డా.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ-ఏ పరిస్థితుల్లో సీపీఆర్ అందించాలన్న విషయం పట్ల అవగాహన అవసరమని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు డా.జి.రామారావు, డా. షరీన్ హసన్ భట్, డా.రామలక్ష్మి, ఎస్పీ సీఐ ఏవీ లీలారావు, ఆర్ఎస్సైలు ఎన్.గోపాల నాయుడు, ఆర్.రమేష్ కుమార్, ఆస్పత్రి టెక్నీషియన్ కేవీ సాయికుమార్, జి.దుర్గారావు, ఆర్ఎస్సైలు. సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹118	₹206	₹218


యూరియా ఇవ్వండయ్యా..!

- రైతుల ఆరాటం
- ఎరువు కోసం వెతుకులాట
- పొటాష్ కూడా దొరకని పరిస్థితి
- అధిక ధరకు విక్రయిస్తున్న ప్రైవేట్ డీలర్లు
- స్పందించని వ్యవసాయ శాఖ అధికారులు



యూరియా బస్తాలు


నాపేరు కర్రి రాజు. మాది విజయనగరం మండలం కోరుకొండ పాలెం గ్రామం. నాకు రెండు ఎకరాల పొలం ఉంది. అందులో వరి పంట వేశాను. రెండో దఫా యూరియా వేసేందుకు రెండు బస్తాల కోసం రైతు సేవా కేంద్రానికి నాలుగు రోజుల క్రితం వెళ్లాను. యూరియా లేదని అక్కడి సిబ్బంది చెప్పారు. దీంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు.


నాపేరు పొటుపు రెడ్డి అప్పలనాయుడు. మాది గంట్యాడ మండలం పెదవేమలి గ్రామం. నాకు రెండు ఎకరాల పొలం ఉంది. వరి పంట సాగు చేశాను. యూరియా కోసం రైతు సేవా కేంద్రానికి వెళ్తే యూరియా లేదని చెప్పారు. కొఠారుబిల్లి జంక్షన్‌లో ఉన్న ప్రైవేట్ డీలర్ వద్దకు వెళ్తే అక్కడ లేదని చెప్పారు. రెండో దఫా ఎరువు వేయడానికి యూరియా దొరకడం లేదు. ఏం చేయాలో తెలియడం లేదు.

విజయనగరం ఫోర్ట్: ఇది ఈ ఇద్దరి రైతుల పరిస్థితే కాదు. అనేక మంది రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితి. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 90వేల హెక్టార్లకు పైగా వరి పంట సాగైంది. రైతులు ప్రస్తుతం రెండో దఫా ఎరువు వేసేందుకు సిద్ధమవుతున్నారు. కొంతమంది రైతులు వేసేశారు. రెండో దఫాలో యూరియా, పొటాష్ కలిపి వేస్తారు. కొంతమంది రైతులు యూరియానే వేస్తారు. అయితే ప్రస్తుతం ఈ రెండు ఎరువులు ఎక్కడా దొరకడం లేదు. రైతుల సంక్షేమం కోసమే పాటుపడుతున్నామని గొప్పలు చెబుతున్న కూటమి ప్రభుత్వం అవసరమైన ఎరువు కూడా అందించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి రైతులకు కష్టాలు తప్పడం లేదు. మొదటి దఫాలో డీఏపీ దొరక్క ఇబ్బంది పడ్డారు. ప్రైవేట్ డీలర్ల దగ్గరకు వెళ్తే గుళికలు కొంటే గానీ డీఏపీ ఇవ్వని పరిస్థితి. ఇప్పుడు యూరియాతో పాటు పొటాష్ కూడా దొరకని పరిస్థితితో జిల్లా అంతటా రైతులు ఇబ్బంది పడుతున్నారు.

యూరియా దొరక్క అవస్థలు

రైతులు యూరియా దొరక్క పోవడం వల్ల అవస్థలు పడుతున్నారు. వ్యవసాయ అధికారులు యూరియా ఉందని చెబుతున్నారు. రైతు సేవా కేంద్రాలకు వెళ్తే యూరియా లేదు. నాలుగైదు రోజుల్లో వస్తుందని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. కొంతమంది ప్రైవేట్ డీలర్ల వద్ద యూరియా ఉన్నప్పటికీ వారు బ్లాక్ చేస్తున్నారు. యూరియా ఉన్నప్పటికీ లేదని చెబుతున్నారు. వారు చెప్పిన ధరకు కొంటేనే ఇస్తున్నారు. రూ.270కి విక్రయించాల్సిన బస్తా యూరియాను రూ.300కు అమ్ముతున్నారు. బస్తా ధర ఎందుకు పెంచారని రైతులు ప్రశ్నిస్తే యూరియా అయిపోయింది వెళ్లి పొండని కరాఖండిగా చెబుతున్నారు. ఈ విషయాన్ని వ్యవసాయ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రైవేట్ డీలర్లు కృతిమ కొరత సృష్టించడంతో పాటు అధిక ధరకు ఎరువులు విక్రయిస్తున్నా వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఐదురోజుల్లో వస్తుంది

యూరియా కొన్ని రైతు సేవా కేంద్రాలు, ప్రైవేట్ డీలర్ల వద్ద ఉంది. నాలుగైదు రోజుల్లో మరో యూరియా రేక్ వస్తుంది. రాగానే రైతు సేవా కేంద్రాలకు పంపిస్తాం.
వి.తారకరామారావు, జిల్లా వ్యవసాయ అధికారి

కనిపించని ఎరువుల ధర పట్టిక

ఎరువుల ధరల వివరాలు, స్టాకు వివరాలు తెలిపే బోర్డులు పెట్టాలని వ్యవసాయ శాఖ ఉన్నత అధికారులు డీలర్లకు పదేపదే చెబుతున్నారు. కానీ ఎక్కడా అది అమలు కావడం లేదు. జిల్లాలో 200 వరకు ఎరువుల దుకాణాలు ఉన్నాయి. కొద్ది మంది డీలర్లు మాత్రమే ధరల వివరాలు బోర్డులు పెడుతున్నారు.

38, 447 మెట్రిక్ టన్నులు యూరియా విక్రయం

జిల్లాలో సెప్టెంబర్ 24 నాటికి 38, 447 మెట్రిక్ టన్నుల యూరియాను ఆర్‌బీకే, ప్రైవేట్ డీలర్లు విక్రయించారు. అదేవిధంగా 3,651 మెట్రిక్ టన్నుల పొటాష్ విక్రయించారు. 12,665 మెట్రిక్ టన్నుల డీఏపీ విక్రయించారు. 11,684 మెట్రిక్ టన్నుల కాంప్లెక్సు ఎరువులు విక్రయించారు. సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 2361 మెట్రిక్ టన్నులు విక్రయించారు.

ప్రైవేట్ డీలర్లకే యూరియా, పొటాష్ ఎక్కువ కేటాయింపు

ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలకు కాకుండా ప్రైవేట్ డీలర్లకు యూరియా, పొటాష్ ఎరువులను ఎక్కువగా కేటాయింపులు చేస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాలకు ఎక్కువగా ఎరువులను కేటాయించేవారు. దీంతో రైతులకు గ్రామాల్లోనే ఎరువులు లభించేవి. ఇప్పుడు ఎరువుల కోసం మండల, జిల్లా కేంద్రాలకు పరిగెత్తాల్సిన పరిస్థితి దాపురించింది.